సంపుటి :03 | సంచిక :46 | పేజీలు :06 | www.aksharadarbar.com

అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

గురువారం 26, మార్చి 2026

# ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి



- అసెంబ్లీలో ఎమ్మెల్యే గండ్ర

02

# కలెక్టర్ గారూ.. ఇటు చూడండి

ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిల్లో అధికారుల 'చీకటి కోణం'

భూపాలపల్లి మున్సిపాలిటీకి రూ.85 కోట్ల మొండి బకాయిలు

- సామాన్యుడిపై ప్రతాపం.. సింగరేణిపై ఉదారత్వం?
- సర్వేలు చేశారు.. లెక్కలు తేల్చారు. అయినా పైసా విదల్చని సింగరేణి
- బకాయిల వసూళ్లలో మున్సిపల్ అధికారుల 'నిలువెత్తు' వైఫల్యం






భూపాలపల్లి మున్సిపాలిటీ ఆదాయానికి భారీ గండి పడుతోంది. పట్టణంలోని సామాన్య ప్రజలు పన్ను కట్టకపోతే ఇంటి సామాన్లు జప్తు చేసి, ఇళ్లను సీజ్ చేసే మున్సిపల్ అధికారులు.. రూ.వందల కోట్లు బకాయి ఉన్న ప్రభుత్వ కార్యాలయాల విషయంలో మాత్రం 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 1,211 ప్రభుత్వ కార్యాలయ భవనాలు ఉన్నాయి. వీటి నుంచి మున్సిపాలిటీకి సుమారు రూ.85 కోట్లు పన్నుల రూపంలో రావాల్సి ఉంది. కానీ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు వసూలైంది కేవలం రూ.6 కోట్లు మాత్రమే. ఇంకా రూ.79 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

– అక్షరదర్బార్, హనుమకొండ

03

- రైస్ మిల్లర్లతో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- వరి ధాన్యం కొనుగోలుపై జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం

02

# ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలి



వరంగల్ నగరంలో 2021లో ఇల్లు కట్టుకోవడమే ఆ యజమానుల పాలిట శాపమైంది. అధికారులే కొలతలు తీసి పన్ను నిర్ణయించినా, ఇప్పుడు తప్పుడు లెక్కలంటూ 25 రెట్ల జరిమానాతో నోటీసులివ్వడం బల్దియా అరాచకానికి పరాకాష్ట. బాధితుల పోరాటంతో ప్రభుత్వం జరిమానా రద్దు చేస్తూ జీవో ఇచ్చినా.. సాఫ్ట్‌వేర్ సాకుతో 2021 బకాయిలను నేటి 2026 ధరలతో వసూలు చేస్తూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నారు. కట్టలేమంటే ఇంట్లోని గ్యాస్ సిలిండర్లు, వస్తువులు ఎత్తుకెళ్తూ సిబ్బంది బరితెగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాత పద్ధతిలోనే పన్ను వసూలు చేయాలి, లేదంటే బాధితుల ఆగ్రహం ఉప్పెనలా మారకముందే ఈ దోపిడీని అరికట్టాలి. – అక్షరదర్బార్, వరంగల్


- ఇంటి పన్ను కడుతుండగా 2023లో హఠాత్పరిణామం
- 25 రెట్లు జరిమానా విధిస్తున్నట్లు నోటీసులు
- తప్పుడు కొలతలు ఇచ్చారంటూ వివరణ
- సర్వేలో యజమానుల తప్పేంలేదంటూ స్పష్టత
- పోరాటం తర్వాత ప్రభుత్వం నుంచి జీవో
- జరిమానా రద్దు.. ఇంతలోనే ట్విస్ట్
- ఇంటిపన్ను 2026 లెక్కల ప్రకారం వర్తింపు
- ఖంగుతున్న యజమానులు.. నాటి కంటే, నాలుగైదు రెట్లు పెరిగిన పన్ను
- ఎలా కట్టాలని తలలు పట్టుకుంటున్న యజమానులు

02

# ఇంటి పన్ను ఎందుకిట్ల ?

జీడబ్ల్యూఎంసీలో వెలుగు చూడని అన్యాయం ఇది !

2021లో ఇండ్లు కట్టుకోవడమే శాపమా!






# ఏసీబీకి చిక్కిన ఎస్సై

- రియల్ ఎస్టేట్ వివాదంతో మధ్యవర్తిత్వం
- రూ.40 వేలు లంచం డిమాండ్
- రూ.20 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

02




# ఇంటి పన్ను ఎందుకిట్ల ?

## జీడబ్ల్యూఎంసీలో వెలుగు చూడని అన్యాయం ఇది !

- 2021లో ఇండ్లు కట్టుకోవడమే శాపమా!
- ఇంటి పన్ను కడుతుండగా 2023లో హఠాత్పరిణామం
- 25 రెట్లు జరిమానా విధిస్తున్నట్లు నోటీసులు
- తప్పుడు కొలతలు ఇచ్చారంటూ వివరణ
- సర్వేలో యజమానుల తప్పేంలేదంటూ స్పష్టత
- పోరాటం తర్వాత ప్రభుత్వం నుంచి జీవో
- జరిమానా రద్దు.. ఇంతలోనే ట్విస్ట్
- ఇంటిపన్ను 2026 లెక్కల ప్రకారం వర్తింపు
- ఖంగుతున్న యజమానులు.. నాటి కంటే, నాలుగైదు రెట్లు పెరిగిన పన్ను
- ఎలా కట్టాలని తలలు పట్టుకుంటున్న యజమానులు

**అక్షరదర్బార్, వరంగల్ :**

**అది.. 2021..**

వరంగల్ నగరవ్యాప్తంగా వేలాది మంది ఇండ్లు కట్టుకున్నారు. తమ కలల ఇంటి నిర్మాణాన్ని సాకారం చేసుకున్నారు. నగరపాలక సంస్థ ఆ ఇండ్లకు ఇంటి నంబర్లు సైతం ఇచ్చింది. అప్పుడు... ఇంటి పన్ను సుమారు రూ.వెయ్యి అనుకుంటే.. కొందరు సంవత్సరానికి రెండు సార్లకు రూ.2 వేల చొప్పున ఇంటిపన్ను కడుతూ వస్తున్నారు. సడెన్‌గా ఏం జరిగిందో తెలియదు..

### - 2023లో నోటీసులు

ఇంటి కొలతల విషయంలో తప్పుడు లెక్కలు ఇచ్చారు.. మీకు సర్కార్ నిబంధనల ప్రకారం.. 25 రెట్లు అధికంగా జరిమానా విధిస్తున్నాం అని బల్దియా నుంచి 2021లో ఇండ్లు కట్టుకుని, ఇంటినంబర్ పొందిన వారందరికీ నోటీ సులు అందాయి. నోటీసులు చూసిన యజమానులు ఖం గు తిన్నారు. `మేం తప్పుడు కొలతలు ఇవ్వలేదు. బల్ది యా అధికారులే వచ్చి కొలతలు తీసుకున్నారు. అందుకు అనుగుణంగా లెక్కలు వేసి, ఇంటి పన్ను నిర్ణయించారు. అప్పటి నుంచి మేం సజావుగానే కడుతున్నాం. బల్దియా ఎందుకు జరిమానా విధించింది.. మేం ఎందుకు జరిమానా కట్టాలి.. `అన్న ఆందోళనలో యజమానులు ఉండిపోయారు..

ఇక అప్పటి నుంచి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) అధికారులు, సిబ్బంది నుంచి వేధింపులు మొదలయ్యాయి. ఇంటి పన్ను కడతారా? చస్తారా? అంటూ 2021లో ఇండ్లు కట్టుకున్న వారిని టార్గెట్ చేశారు. యజమానులు తాము ఏ తప్పు చేయలేదన్నా, ఎవరూ వినడం లేదు. ఏ అధికారీ సరైన కారణం చెప్పలేదు. యంత్రాంగం మాత్రం వేధింపులు ఆపలేదు. జరిమానా ఎందుకు విధించారని నిలదీస్తే, కొందరు అధికారులేమో.. మీరు తప్పుడు ఇంటికి కొలతలు ఇచ్చారు అని కొందరు. ఏదైనా సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తి ఉండవచ్చు అని కొందరు సమాధానమిచ్చారు. అసలు.. ఈ తలనొప్పి అంతా ఎందుకు.? అని కొందరు యజమానులు జరిమానా సహా బల్దియాకు ఇంటిపన్ను చెల్లించారు. అది.. ఎంతంటే.. ఉదాహరణకు 2021లో ఇంటి పన్ను సంవత్సరానికి రెండు సార్లు కలిపి రూ.4 వేలు అనుకుంటే, అది ఇప్పటివరకు రూ.లక్ష దాటింది. మరి కొందరు పోరాటానికి దిగారు. స్థానిక కార్పొరేటర్లు, అర్బన్ ఎమ్మెల్యేలను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని చర్చ లేవనెత్తారు. ఈ అంశంపై నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో చర్చకు వచ్చింది. కౌన్సిల్ సభ్యులు ఒక తీర్మానం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు.

### - ఇదేంటని నిలదీస్తే..

ఇంటిపన్ను ఎక్కువగా వస్తున్నదని బల్దియా అధికారులను ఇంటి యజమానులు నిలదిస్తే, ఇంటి పన్ను విధింపు అంశాన్ని సాఫ్ట్‌వేర్ చూసుకుంటుంది. మాకు ఎలాంటి సంబంధం లేదు అని సమాధానం వస్తున్నది. అక్కడితో ఆగినా ఫర్వాలేదు గానీ, ` మీకేం.. మీకు అనుకూలమైన జీవో వచ్చింది. ఇంటిపన్ను 25 రెట్ల జరిమానా రద్దయింది. పైసా జరిమానా కట్టక్కర్లేదు. ఇంకేం.. అప్‌డేట్ అయిన ఇం టి పన్ను కట్టలేరా?` అంటూ ఉచిత సలహాలివ్వడం ఇంటి యజమానులకు ఆగ్రహం తెప్పించింది. మా ముందు ఇం డ్లు కట్టకున్నారికి ఈ బాధలేదు. మా తర్వాత ఇండ్లు కట్టుకున్నవారికి ఈ బాధ లేదు. మాకెందుకు ఈ శిక్ష అంటూ నిట్టూర్పు విడుస్తున్నారు. కొందరైతే.. అప్పో సప్పో చేసి బల్దియాలో పెండింగ్ ఉన్న ఇంటిపన్నంతా కట్టేస్తున్నారు.

### - జీవో వచ్చిన తర్వాత గోల్ మాల్

**ఇంటి యజమానుల పోరాట ఫలితంగా జరిమానా నోటీసులు అందుకున్న ఇంటి యజమానులకు గతేడాది ఊరట లభించింది. 2021లో ఇండ్లు కట్టుకున్న యజమానులకు జరిమానాను రద్దు చేస్తూ ప్రభుత్వం నుంచి జీవో విడుదలైంది. ఇక సమస్య తీరిందని యజమానులు ఊరట చెందేలోపే.. మరో పిడుగు వారి నెత్తిన పడింది.. అది ఏంటంటే... 2021లో రూ.2000 వేలు ఉన్న ఇంటిపన్నును బల్దియా, నిన్న ఇవాళ లెక్క కట్టుకున్న వారికి విధిస్తున్నట్లు రూ.4 వేల వరకు విధించింది. ఆ అదనపు ఇంటిపన్ను విధింపు ఎందుకో అర్థం కాక ఇంటి యజమానులు మళ్లీ తలపట్టకున్నారు. ఉదాహరణకు.. ఒక ఇంటి యజమాని నాడు రూ. 2 వేలు కడితే, ఇప్పటి పన్ను ప్రకారం.. రూ.4 వేల వరకు అయింది.. అంటే, ఆ యజమాని పెండింగ్ ఇంటి పన్ను అంతా.. కొత్త పన్ను ప్రకారం.. అణా పైసా సహా చెల్లించాల్సి ఉన్నదన్నమాట.**

### - సిబ్బంది అరాచకాలు

ఇంటి పన్ను వసూళ్లపై జీడబ్ల్యూఎంసీ సిబ్బంది అరాచకాలు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి. ఉన్నతాధికారుల పర్య వేక్షణలో ప్రతిరోజు ప్రతి బజారుకు ఒక ట్రాక్టర్ వెళ్తున్నది. ఇంటి పన్ను కట్టని వారి ఇళ్లకు వెళ్లి సిబ్బంది దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. ఇంట్లో ఏ వస్తువు ఉంటే, ఆ వస్తువును టాక్టర్‌లో వేసుకుని వెళ్తున్నారు. అలాగే, ఈ మధ్య ఒక ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఎత్తుకుని వెళ్లడం, అందుకు సంబంధించిన చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇవే తరహా వేధింపులు ఇప్పుడు 2021 లో ఇండ్లు కట్టుకున్న వారికీ ఎదురవుతున్నాయి. పాత పెండింగ్ ఇంటి పన్నంతా కట్టాలంటే, మాటలు కాదు.. అలా, అని బల్దియా ఊరుకో వడం లేదు. ఏం చేయాలో తెలియక ఇంటి యజమానులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యకు ఎవరు పరిష్కారం చూపుతారంటూ.. నిట్టూరుస్తున్నారు.

# ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

### - అసెంబ్లీలో ఎమ్మెల్యే గండ్ర



అక్షరదర్బార్, భూపాలపల్లి: గురువారం శాసనసభలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వివిధ అంశాలపై మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని శాయంపేట మండలంలో గోవిందాపూర్, పెద్దకోడపాక గ్రామంలోని పంట పొలాలకు సాగునీరు లేకపోవడం వలన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది కావున నీటిని విడుదల చేసి పంట పొలాలకు నీటిని అందించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం నుంచి నిరంతరం ఇసుక, బొగ్గు, బూడిద లారీల రవాణా అధికంగా ఉన్నందున ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేయాలని, కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నూతన పోలీస్ స్టేషన్ నిర్వహణకు భవనం మంజూరి చేయాలని ఆయన కోరారు.

# ధాన్యం దిగుమతి చేసుకోవాలి

### : కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

అక్షర దర్బార్, హనుమకొండ: రబీ సీజన్‌లో కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లు తప్పనిసరిగా దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కేటాయింపులు చేస్తామని, నిబంధనల ప్రకారం ధాన్యాన్ని మిల్లులకు తరలించుకోవాలని సూచించారు. కేటాయింపుల విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు సమయంలో ప్యాడి క్లీనర్ల ద్వారా శుభ్రపరిచిన ధాన్యాన్నే పంపాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించినట్లు పేర్కొన్నారు. మిల్లర్లు తమ వద్ద సరిపడా నిల్వ సదుపాయాలు కల్పించుకోవాలని తెలిపారు. అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన ధాన్యాన్నే స్వీకరించాలని, నేరుగా వచ్చే ధాన్యాన్ని తీసుకోకూడదని మిల్లర్లకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎండీ వాజిద్ అలీ, జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఏసీబీకి చిక్కిన ఎస్సై

- రియల్ ఎస్టేట్ వివాదంతో మధ్యవర్తిత్వం
- రూ.40 వేలు లంచం డిమాండ్
- రూ.20 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ



అక్షరదర్బార్, నిర్మల్ : నిర్మల్ జిల్లా మామడ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ తీగల అశోక్ లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. ఏసీబీ డీఎస్పీ మధు తెలిపిన వివరాల ప్రకారం.. మామడ మండలానికి చెందిన ఒక రియల్ ఎస్టేట్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించి, సమస్యను పరిష్కరించేందుకు ఎస్సై అశోక్ సదరు బాధితుడిని రూ.40,000 డిమాండ్ చేశారు. లంచం ఇవ్వకుంటే కేసు నమోదు చేస్తానని బెదిరించడంతో, బాధితుడు చివరకు రూ.20,000 ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారి సూచన మేరకు నగదు అందజేస్తుండగా అధికారులు మెరుపు దాడి చేసి ఎస్సైను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఎస్సై ని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టారు. గతంలో ఇదే పీఎస్ ఎస్సై సత్యనారాయణరాజుతో పాటు మరో ఎస్సై కూడా చిక్కారు. మూడో ఎస్సై కూడా ఏసీబీకి చిక్కడం గమనార్హం.



# కలెక్టర్ గారూ.. ఇటు చూడండి

- ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిల్లో అధికారుల 'చీకటి కోణం'
- భూపాలపల్లి మున్సిపాలిటీకి రూ.85 కోట్ల మొండి బకాయిలు
- సామాన్యుడిపై ప్రతాపం.. సింగరేణిపై ఉదారత్వం?
- సర్వేలు చేశారు.. లెక్కలు తేల్చారు. అయినా పైసా విదల్చని సింగరేణి
- బకాయిల వసూళ్లలో మున్సిపల్ అధికారుల 'నిలువెత్తు' వైఫల్యం

అక్షరదర్బార్, హనుమకొండ : భూపాలపల్లి మున్సిపాలిటీ ఆదాయానికి భారీ గండి పడుతోంది. పట్టణంలోని సామాన్య ప్రజలు పన్ను కట్టకపోతే ఇంటి సామాన్లు జప్తు చేసి, ఇళ్లను సీజ్ చేసే మున్సిపల్ అధికారులు.. రూ.వందల కోట్లు బకాయి ఉన్న ప్రభుత్వ కార్యాలయాల విషయంలో మాత్రం 'నిమ్మకు నీరెత్తినట్లు' వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 1,211 ప్రభుత్వ కార్యాలయ భవనాలు ఉన్నాయి. వీటి నుంచి మున్సిపాలిటీకి సుమారు రూ.85 కోట్లు పన్నుల రూపంలో రావాల్సి ఉంది. కానీ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు వసూలైంది కేవలం రూ.6 కోట్లు మాత్రమే. ఇంకా రూ.79 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

### ■ సింగరేణిదే సింహభాగం..

మొత్తం బకాయిల్లో ఒక్క సింగరేణి సంస్థ నుండే రూ.73 కోట్లకు పైగా రావాల్సి ఉంది. ఏటా రూ.1.70 కోట్లు పన్ను చెల్లించాలని మున్సిపల్ అధికారులు నిర్ధారించినప్పటికీ, సింగరేణి యాజమాన్యం ఏటా కేవలం రూ.58 లక్షలు మాత్రమే చెల్లిస్తూ వస్తోంది. మున్సిపల్, సింగరేణి అధికారులు సంయుక్తంగా 'జాయింట్ సర్వే' నిర్వహించి పన్ను ఖరారు చేసినా, సింగరేణి అధికారులు రకరకాల కొర్రీలు పెడుతూ కాలయాపన చేస్తున్నారు. పెనాల్టీలు తొలగించినా, మున్సిపల్ చట్టం ప్రకారం సవరణలు చేసినా నయా పైసా అదనంగా చెల్లించడానికి సింగరేణి మొండికేస్తోంది.

### ■ సామాన్యుడికి ఒక న్యాయం.. ప్రభుత్వానికి ఒక న్యాయమా?

"చిన్నపాటి ఇల్లు ఉండి పన్ను కట్టలేకపోతే మా ఇళ్లలోకి చొరబడి సామాన్లు ధ్వంసం చేస్తారు.. కానీ కోట్లకు కోట్లు ఎగ్గొడుతున్న సింగరేణిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?" అని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు. అధికారుల ఈ ద్వంద్వ వైఖరి వెనుక ఉన్న 'మతలబు' ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ బకాయిల వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని జనం కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందిస్తే తప్ప ఈ 'చీకటి కోణం' బయటపడదని, మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం సకాలంలో వస్తేనే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని వారు డిమాండ్ చేస్తున్నారు. "సింగరేణి, ఫారెస్ట్, పోలీస్ సహా అన్ని శాఖలకు నోటీసులు ఇచ్చాం. మార్చి 31 తర్వాత ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, సింగరేణి నుండి రావాల్సిన పూర్తి బకాయిలతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల పన్నులను కూడా వసూలు చేస్తాం" అని మున్సిపాలిటీ అధికారి ఒకరు అన్నారు.



# డీలర్లపై భారంగా 10 లక్షల డిపాజిట్

- నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- అసోసియేషన్ డిమాండ్
- ఎన్ఎఫ్ఎల్ అధికారులకు వినతిపత్రం

అక్షర దర్బార్, హైదరాబాద్ : నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్) కంపెనీ డీలర్ల సెక్యూరిటీ డిపాజిట్‌ను భారీగా పెంచడంపై డీలర్ల అసోసియేషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న రూ.1 లక్ష డిపాజిట్‌ను ఏకంగా రూ.10 లక్షలకు పెంచడం డీలర్లపై తీవ్ర ఆర్థిక భారంగా మారుతుందని తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ మరియు సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఎన్ఎఫ్ఎల్ కార్యాలయంలో స్టేట్ మేనేజర్ రాకేష్‌ను అసోసియేషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. డీలర్ల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పెంచిన డిపాజిట్‌ను రద్దు చేసి పాత విధానంలోనే రూ.1 లక్షకు పరిమితం చేయాలని కోరారు. అలాగే ఎరువుల సరఫరాలో ఇతర ఉత్పత్తులను బలవంతంగా జత చేసే విధానాన్ని నిలిపివేసి, నేరుగా ఎరువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కరువు పరిస్థితులు, వ్యాపార ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని కంపెనీ యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రామడుగు మనోహర్ రావు, కోశాధికారి సిద్ది నాగరాజు, రాష్ట్ర కార్యదర్శులు ప్రతాపని పాండురంగయ్య, గుర్రం మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ ని సద్వినియోగం చేసుకోండి

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: జాతీయ , రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలను అనుసరించి, ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఈ నెల 28  శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ ను ములుగు జిల్లా కోర్టులో నిర్వహిస్తున్నాము అని ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడదగు క్రిమినల్, సివిల్ కేసులు, భూ తగాదాల కేసులు, మోటార్ వెహికిల్ యాక్సిడెంట్ కేసులు, వివాహ , కుటుంబ తగాదా కేసులు, బ్యాంకు, ఇన్సూరెన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, ప్రీ–లిటిగేషన్ కేసులు ఇతర రాజీపడదగు కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుకోవాలని కోరారు.

# పరిశుభ్రతతోనే ఆరోగ్యం

అక్షరదర్బార్, న్యూశాయంపేట: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇనుగాల రాధిక అన్నారు. న్యూశాయంపేట పరిధిలో పోచంపల్లిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, వరంగల్ వెస్ట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇనుగాల రాధిక ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం 3వ రోజు 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో ప్రభుత్వ పాఠశాల పోచంపల్లి ప్రాంతంలో పిచ్చి మొక్కలు, ముళ్ళ మొక్కలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పారు. వయ్యారిభామ వంటి మొక్కల నుంచి విడుదల అయ్యే పరాగరేణువుల వల్ల శ్వాస సంబంధిత వ్యాధులు కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు సుజాత, జిపిఎస్ హెడ్మాస్టర్ జి ఉప్పలయ్య, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# మొగుళ్లపల్లిలో "అరైవ్- అలైవ్"

### డ్రంక్ అండ్ డ్రైవ్ పై  పోలీసుల అవగాహన

అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: మొగుళ్ళపల్లి మండలం ఇప్పలపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం మొగుళ్లపల్లి పోలీస్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ " అంశంపై అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొగుళ్లపల్లి ఎస్సై ఎం. సురేష్ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, ప్రాణనష్టం మరియు చట్టపరమైన చర్యల గురించి వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌ను నియంత్రించేందుకు మొగుళ్లపల్లి పి.ఎస్ పరిధిలో ప్రత్యేక డ్రైవులు మరియు క్రమం తప్పని తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, తమతో పాటు ఇతరుల భద్రతను కాపాడాలని సూచించారు ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎస్సై సురేష్ తెలిపారు,



# మృతుల కుటుంబాలకు పరామర్శ..

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండల కేంద్రంలో ఇటీవల కాలంలో  అనారోగ్యంతో మరణించిన గట్ల అహల్యమ్మ ,బెరుగు రాజయ్య ,కూరాకుల పోచమ్మ , అదేవిధంగా గురువారం మరణించిన బాసాని పుల్లమ్మ చిత్రపటాలకు బీజేపీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి ,సత్యపాల్ రెడ్డి లు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసినారు.వారి వెంట జిల్లా కౌన్సిలింగ్ సభ్యులు కానుగుల నాగరాజు, మండల అధ్యక్షులు రామకృష్ణ, సీనియర్ నాయకులు



వనం దేవరాజు, ఉప్పు రాజు, సంజీవ్, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, మండల ఉపాధ్యక్షులు రాజశేఖర్, మండల కార్యదర్శి సుమన్, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాలుగు చంద్రయ్య

### కోశాధికారిగా బానోత్ స్వామిదాస్

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి : ములుగు జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా  బాలుగు చంద్రయ్య, కోశాధికారిగా బానోత్ స్వామిదాస్ ఎన్నికయ్యారు. అధ్యక్షులు , కోశాధికారి పదవికి ఎన్నికలు జరిగాయి. మొత్తం 37 ఓట్లు పోలవ్వగా అధ్యక్షులు బాలుగు చంద్రయ్య కు 21ఓట్లు రాగ,బొల్లి సారంగపాణి కి 16ఓట్లు వచ్చాయి. కోశాధికారి పదవికి బానోత్ స్వామిదాస్ కి 24 ఓట్లు రాగ, ఓ. రాజేందర్ కి 13ఓట్లు వచ్చాయి. బానోత్ స్వామిదాస్ వరసగా మూడవ సారి కోశాధికారి ఎన్నికయ్యారు.ఏకగ్రీవంగా ఎన్నికైనా వాటిలో ప్రధాన కార్యదర్శిగా కొండి రవీందర్, ఉపాధ్యక్షులుగా రంగోజు బిక్షపతి,జాయింట్ సెక్రటరీ గా రాచర్ల రాజ్ కుమార్,లేడీ జాయింట్ సెక్రటరీ గా బి. నవత, ఈ సి మెంబర్లు గా రంగోజు సూర్యం, ఎండీ. మన్సూర్ అలీ, జి. అరుణ్ కుమార్, డి. సంజీవ, సుదర్శన్, పి. అర్చన, కె. సుస్మిత లను ఎన్నుకోవడం జరిగింది.



# అరెస్టులతో పోరాటాలు ఆగవు

**: డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భూక్యా నవీన్**

అక్షర దర్బార్ చిట్యాల : అరెస్టులతో డీవైఎఫ్ఐ పోరాటాలను ఆపలేరని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి భూక్యా నవీన్ అన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ చేపట్టిన "చలో అసెంబ్లీ" కార్యక్రమం నేపథ్యంలో గురువారం చిట్యాల మండలం రామచంద్రపురంలో నవీన్‌ను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. రూ.4,000 నిరుద్యోగ భృతి కోసం బడ్జెట్ కేటాయించాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయాలని, క్రీడా రంగానికి రూ.1000 కోట్లు కేటాయించాలని కోరారు. అనవసర అరెస్టులు మానుకొని ప్రభుత్వ హామీలను తక్షణమే అమలు చేయాలని నవీన్ డిమాండ్ చేశారు.



# చిట్యాల సంత వేలం పాట

**హక్కులు సొంతం చేసుకున్న రమణాచారి**

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలో ప్రతి సోమవారం జరిగే వారంతపు సంత కూరగాయల మార్కెట్ నిర్వహణ హక్కులను చిట్యాలకు చెందిన చిలుముల రమణ చారి గురువారం నిర్వహించిన వేలం పాటలో సొంతం చేసుకున్నాడు. గ్రామపంచాయతీ సర్పంచ్ తౌటం లక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో గ్రామ పంచాయతీ కార్యదర్శి సమక్షంలో వేలంపాటను నిర్వహించారు. ఈ వేలంపాటలో ఐదుగురు వ్యక్తులు పాల్గొనగా రూ.85100 లకు చిలుముల రమణాచారి సంతలో చీటీ వసూలు చేసే అధికారాన్ని దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా చిలుముల రమణ చారిని చిట్యాల సర్పంచ్ తౌటం లక్ష్మి సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, వార్డ్ మెంబర్ నవీన్, వైదం శ్రీకాంత్ శ్రావ్య పాల్గొన్నారు.

# ఎవరికీ దక్కనుంది పీఠం ?

**కాంగ్రెస్ అధ్యక్ష పోరు హోరాహోరీ**



పరకాలలో 32 మంది ఆశావహులు

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్ష పదవులు రద్దు కావడంతో నూతన అధ్యక్ష ఎన్నికల పోరు హోరాహోరీగా మారింది. పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఏకంగా 32 మంది ఆశావాహులు పోటీలో ఉండటంతో ఎవరికి అవకాశం దక్కనుందన్నదానిపై పార్టీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.ఇప్పటి వరకు అధ్యక్ష పదవులు చేపట్టిన వారికి కాకుండా కొత్త వారికి అవకాశమివ్వాలన్న దిశగా ఎమ్మెల్యే సానుకూలంగా ఉన్నారన్న ప్రచారం పార్టీలో వినిపిస్తోంది. అదే సమయంలో పార్టీకి గతం నుండి సేవలందిస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని మరో వర్గం అభిప్రాయపడుతోంది. అధ్యక్ష పదవికి పూర్తి అవగాహనతో పాటు అందరిని కలుపుకొని ముందుకు నడిపించే నాయకుడిని ఎంపిక చేయాలని పార్టీ అంతర్గతంగా చర్చలు కొనసాగుతున్నాయి. ఏకగ్రీవంగా ఒకరిని ఎన్నుకుంటే మంచిదని, లేదంటే అంతర్గత విభేదాలు తలెత్తే అవకాశం ఉందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. పార్టీని బలోపేతం చేసేలా, సమన్వయంతో ముందుకు తీసుకెళ్లగల నాయకుడికే అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే కాంగ్రెస్‌కు మేలు జరుగుతుందని సీనియర్ నాయకులు సూచిస్తున్నారు. మొత్తం మీద పరకాలలో కాంగ్రెస్ అధ్యక్ష పీఠం కోసం పోటీ రసవత్తరంగా కొనసాగుతోంది.



# కొమ్మాల హుండీ లెక్కింపు

**రూ.14,49,156 ఆదాయం**

అక్షర దర్బార్, గీసుకొండ: కొమ్మాల లక్ష్మీనర సింహ స్వామి రెండో విడత హుండీల లెక్కింపు గురువారం పూర్తయింది. లెక్కింపు ద్వారా రూ.14,49,156 ఆదాయం వచ్చినట్లు ఈవో ప్రసాద్ తెలిపారు. మొదటి, రెండవ విడత శీఘ్ర, ప్రత్యేక దర్శనం, కేశ ఖండనం, అష్టోత్తరం మొత్తం కలుపుకొని రూ.56 లక్షల 63వేల 566 ఆదాయం సమకూరింది. గతేడాది కంటే రూ.లక్షా 69 వేల ఆదాయం అధికంగా వచ్చినట్లు ఈవో తెలిపారు. హుండీ లెక్కింపులో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కన్నెబోయిన యమున ప్రవీణ్, సూర్యాతండ సర్పంచ్ రాఘవేంద్ర, ఉత్సవ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్ కందారి సంతోష్, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



# రేపు శివాజీ విగ్రహావిష్కరణ

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలంలోని వరికోల్ గ్రామంలో రేపు (శుక్రవారం) ఘనంగా ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవం, శివాజీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ దొగ్గేల కుమారస్వామి, మాజీ వైస్ ఎంపీపీ చందా కుమారస్వామి తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించడంతో పాటు, గ్రామ ప్రజల చిరకాల స్వప్నమైన ఎస్ఆర్ఎల్ నూతన ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఈ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి సహకారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగుర్ల వెంకన్న తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మురాల భుజంగరావు, బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పోశాల అశోక్ గౌడ్, వార్డు సభ్యులు పిట్ట మల్లేష్, నేరెళ్ల కరుణాకర్, పర్శ ఎల్లస్వామి, గజ్జి తిరుపతి, కురుమిల్ల శ్రీనివాస్, పర్శ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



# ఉప్పరపల్లిలో గ్రంథాలయం ప్రారంభం

**ప్రారంభించిన కలెక్టర్ సత్యశారద**

అక్షర దర్బార్, చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ డా. సత్య శారద గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తకాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠన అలవాటు పెంపొందించేందుకు గ్రంథాలయాలు కీలకమని పేర్కొన్నారు. పుస్తకాలు జీవితాన్ని మారుస్తాయని, విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విభిన్న విషయాలపై పుస్తకాలు చదవాలని సూచించారు. గ్రంథాలయాలు వ్యక్తిత్వ వికాసానికి, సృజనాత్మకత పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. పఠన కార్యక్రమాల ద్వారా పుస్తకాలు, వార్తాపత్రికలు, పోటీ పరీక్షల మెటీరియల్ అందుబాటులో ఉంచి, క్విజ్‌లు, గ్రూప్ డిస్కషన్‌లతో విద్యార్థుల ప్రతిభను వెలికితీసే ప్రయత్నం చేస్తామని చెప్పారు. పాఠశాల విద్యార్థుల ప్రతిభను అభినందించిన కలెక్టర్, ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. క్రాఫ్ట్ టీచర్ ఇందిరా ఆధ్వర్యంలో తయారైన వస్తువులను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, విద్యాశాఖ అధికారులు, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన దామెర ఎస్సై అశోక్

**పారిపోయిన బాలికను కుటుంబ సభ్యులకు అప్పగింత**

అక్షరదర్బార్, పరకాల: ములుగు జిల్లా గోరికొత్తపల్లి గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలిక గురువారం ఉదయం దామెర పరిధిలోని ఓగ్లాపూర్ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించింది. సైలాని బాబా దర్గా సమీపంలో ఒంటరిగా ఉన్న బాలికను గమనించిన దామెర పెట్రోలింగ్ పోలీసులు వెంటనే ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. దామెర ఎస్.ఐ. కొంక అశోక్ బాలికతో మాట్లాడి వివరాలు తెలుసుకోగా, తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో చెప్పకుండా వచ్చినట్లు వెల్లడించింది. అనంతరం ఆమె తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి బాలికను వారికి సురక్షితంగా అప్పగించారు. ఎస్.ఐ అశోక్ తన భోజనాన్ని బాలికకు అందించి మానవత్వాన్ని చాటారు.



# ప్రభుత్వ ఆస్పత్రుల్లో కలెక్టర్ల తనిఖీ

## ఎమ్మార్ఐ యంత్రం, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు పనుల పరిశీలన





అక్షర దర్బార్ జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/చెన్నారావుపేట : జిల్లా ప్రధాన ఆసుపత్రిలో జరుగుతున్న పనులపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మారై యంత్రం, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు పనులను పరిశీలించారు. ఎమ్మారై యంత్రం ఏర్పాటుకు అవసరమైన విద్యుత్ సౌకర్యాల కల్పనలో జాప్యం జరుగుతున్నదని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల పర్యవేక్షణలో నిర్లక్ష్యం ఉన్నట్లు భావించి సంబంధిత అధికారులను మందలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ విధులకు గైర్హాజరు కావడంపై షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. ఎమ్మారై పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్డీఓను బాధ్యతగా నియమించినట్లు తెలిపారు. విద్యుత్ పరికరాల సమకూర్పులో ఆలస్యం ఎందుకని ప్రశ్నిస్తూ, ఈ విధంగా కొనసాగితే పనులు పూర్తికావడానికి ఇంకా ఎంత సమయం పడుతుందో అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మారై యంత్రం అత్యవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నెలాఖరు లోపు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఉప పర్యవేక్షకులు డా. వెంకటరత్నం, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. రాజేష్, టీజీఎంఎస్ ఐడీసీ ఏఈ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### చెన్నారావుపేట పీహెచ్ సీలో..

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సీ ఆవరణ, వైద్య సిబ్బంది హాజరు పట్టికలు, విధుల నిర్వహణను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను సమీక్షించి, చికిత్స విధానంపై ఆరా తీశారు. ఔషధ నిల్వలను తనిఖీ చేసి, అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించడంలో నిర్లక్ష్యం ఉండకూడదని, పరిశుభ్రత, సేవల ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. సమయపాలన పాటించని, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తనిఖీలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వైద్య మరియు ఆరోగ్యాధికారి డా. సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.



## మైలారంలో పశువైద్య శిబిరం

శాయంపేట: పశుసంవర్ధక శాఖ, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శాయంపేట మండలం మైలారం గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ నూనె దివ్య తిరుపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏఎంసీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ పశువులను వ్యాధుల నుంచి రక్షించుకోవాలని రైతులకు సూచించారు. మండల పశువైద్యాధికారి ఎం. సునీల్ మాట్లాడుతూ రైతులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని పశువులకు టీకాలు వేయించి, సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ వెంకట్ రాజిరెడ్డి, ఇతర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## గీతాంజలి పాఠశాలలో
# జిల్లా స్థాయి చెస్ పోటీలు



అక్షర దర్బార్, భద్రాద్రి కొత్తగూడెం: గీతాంజలి పబ్లిక్ స్కూల్‌లో భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాల స్థాయి చెస్ పోటీలను ఈ నెల 29న నిర్వహించనున్నట్లు గీతాంజలి విద్యా సంస్థల చైర్మన్ డా. వేములపల్లి సుబ్బారావు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ పోటీల్లో అండర్–9, అండర్–12, అండర్–15 విభాగాల్లో బాలురు, బాలికలకు విడిగా పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు మొత్తం 30 ట్రోఫీలు, ప్రతి పాల్గొనే క్రీడాకారుడికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలు స్విస్ లీగ్ విధానంలో జరుగుతాయని ఇంటర్నేషనల్ చెస్ ప్లేయర్ సీహెచ్ గోపీకృష్ణ తెలిపారు. పాల్గొనదలచిన వారు పాల్గొనేవారు 9440162749, 9182225496 లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు తమ చెస్ బోర్డులు వెంట తీసుకురావాలని, ఉదయం 9 గంటలలోపు గీతాంజలి పబ్లిక్ స్కూల్‌కు చేరుకోవాలని తెలిపారు. పాల్గొనే వారికి మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

## పారిశుద్ధ్య పట్టణంగా
# నర్సంపేట అభివృద్ధి

### : చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్

అక్షరదర్బార్ , నర్సంపేట: ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో నర్సంపేట పట్టణాన్ని పారిశుద్ధ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ తెలిపారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులు, పారిశుధ్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అవసరమైన చోట కొత్త బోర్లు వేసి మోటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జీడయ్యపల్లె ప్రాథమిక పాఠశాలను సందర్శించి, అవసరమైన నిధులు కేటాయించి వసతులు మెరుగుపరుస్తామని తెలిపారు. ప్రతి వార్డును పరిశుభ్రంగా ఉంచే దిశగా చర్యలు తీసుకుంటామని, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో



మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ గారు & స్థానిక వార్డు కౌన్సిలర్,నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని రాజేందర్,17వ కౌన్సిలర్ అయూబ్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు కొల్లూరి మధుకర్, కార్యకర్తలు, వార్డు ప్రజలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## పెట్రోల్ బంక్ లో అదనపు కలెక్టర్ తనిఖీ

అక్షర దర్బార్,జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : జిల్లాలో ఇంధన సరఫరా పారదర్శకంగా, నిరంతరంగా కొనసాగాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. గురువారం భూపాలపల్లిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోల్, డీజిల్ నిల్వలు, సరఫరా విధానం, అమ్మకాల ప్రక్రియ, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమయానికి సరఫరా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వదంతులను నమ్మవద్దని, అవసరానికి మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అక్రమంగా నిల్వలు చేయడం లేదా అనధికారిక అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో పౌర సరఫరాల అధికారి శరణ్ కుమార్, ఇన్ స్పెక్టర్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన రాణా ప్రతాప్ రెడ్డి



అక్షరదర్బార్ , నర్సంపేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్, వరంగల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి గురువారం కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నర్సంపేట నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధిపై ఇద్దరూ చర్చించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, భవిష్యత్‌లో బీజేపీకి మంచి అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు.

## వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్




అక్షర దర్బార్ చిట్యాల : వేసవికాలంలో దొంగతనాలు పెరిగే అవకాశమున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడుతూ, ఎండల కారణంగా చాలా మంది ఆరుబయట నిద్రించే పరిస్థితి ఉండటంతో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. బంగారం ధరలు పెరగడంతో దొంగలు నివాస ప్రాంతాలపై కన్నేస్తారని పేర్కొన్నారు. మహిళలు బయట పడుకునే సమయంలో బంగారు ఆభరణాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, నగదు, నగలను సురక్షిత ప్రదేశాల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా తిరిగే కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపించినా డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజల సహకారంతోనే దొంగతనాలను నియంత్రించవచ్చని, భద్రత కోసం ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915